షెల్టర్లు లేక విద్యార్థుల అవస్థలు

- చెట్ల నీడన, స్తంభాల వద్ద గంటల తరబడి పడిగాపులు
- దృష్టి సారించని అధికారులు


సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద స్తంభం నీడలో కూర్చున్న విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు యూటర్న్ వద్ద నిల్చుందామంటే షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ..వానకు తడుస్తున్నారు. రెండు కళాశాలలు, మోడల్ పాఠశాలల్లో కలిసి వెయ్యి మంది విద్యార్థులకు పైగా విద్యనభ్యసిస్తున్నారు. కానీ విద్యార్థులకు కనీస వసతులు లేక సతమతమవుతున్నారు. జాతీయ రహదారి విస్తరణ చేసి దాదాపు పదేళ్లు దాటిన ఇప్పటికీ బస్ షెల్టర్ ఏర్పాటు చేయడంలో హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా కనిపిస్తుంది. కళాశాలలకు ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు భారీగా వస్తుంటారు. కళాశాలల సమయం ముగియగానే ఒక వేళ వర్షం కురిసిన చెట్ల నీడే వారికి దిక్కవుతుంది. బస్సులు వచ్చే దాక వారికి ఆ ప్రాంతంలో ఉన్న చెట్లే వారికి నిలువ నీడనిస్తున్నాయి. కళాశాలలు వదలగానే చెట్ల నీడన వచ్చి చేరుతున్నారు. కొంత మంది విద్యార్థులు విద్యుత్ స్తంభాల నీడన కూర్చుంటున్నారు. విద్యుత్ స్తంభాల నీడన కూర్చోవడంతో ప్రమాదం పొంచి ఉంది. 44వ జాతీయ రహదారిపై విద్యార్థులు పడుతున్న కష్టాలు ఏ అధికారికి పట్టడం లేదు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని తల్లిదండ్రులు పేర్కొంటున్నప్పటికి అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు. జాతీయ రహదారికి ఇరువైపుల బస్ షెల్టర్‌లను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు వసతి కల్పించినట్లు అవుతుంది.

విద్యార్థుల భద్రత గాలికి..

గతంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 44వ జాతీయ రహదారిపై పాఠశాల, కళాశాలలు వదిలే సమయాల్లో, ఉదయం రోడ్డు క్రాస్ చేసే సమయంలో ప్రత్యేక పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసే వారు. కానీ ప్రస్తుతం పోలీస్ శాఖ విద్యార్థుల భద్రతను గాలికి వదిలేసినట్లు కనిపిస్తుంది.

షెల్టర్ ఏర్పాటు చేయాలి



44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మోడల్ స్కూల్, కళాశాలల విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా బస్ షెల్టర్‌లను ఏర్పాటు చేయాలి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఉండవు.నిల్చోవడానికి నీడ లేక ఎండకు ఎండుతూ. వానకు తడుస్తున్నారు. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించి షెల్టర్‌లను ఏర్పాటు చేయాలి.

– నల్ల సత్యం, విద్యార్థి తండ్రి, సదాశివనగర్

భారమైన ప్రయాణం

- రామారెడ్డి–కామారెడ్డి రోడ్డు మార్గం మూసివేతతో ఇబ్బందులు
- పోసానిపేట్–గొల్లపల్లి మీదుగా ప్రయాణాలు


గంగమ్మ వాగు సర్వీస్ రోడ్డుపై ప్రవహిస్తున్న నీళ్లు

రామారెడ్డి : గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్డుపై నుంచి భారీ వర్షంతో నీటి ప్రవాహం కారణంగా రామారెడ్డి కామారెడ్డి రోడ్డు మార్గాన్ని మూసివేశారు. రామారెడ్డి నుంచి కామారెడ్డికి వివిధ పనులు ఉపాధి నిమిత్తం వెళ్లేవారు రూ. 60 ఆటో చార్జీలు పెట్టి వెళ్లాల్సి వస్తుంది. మామూలు రోజుల్లో ఈ రోడ్డు అందుబాటులో ఉన్న సమయంలో రామారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్లేవారు రూ. 20 చార్జీలు ఉండగా ప్రస్తుతం రామారెడ్డి నుంచి వయా దూరం కామారెడ్డికి 10 కిలో మీటర్ల నుంచి 25 కి.మీకు పెరగడంతో చార్జీలు కూడా పెంచేశారు. మేజర్ జీపీ అయిన రామారెడ్డికి బస్సు సౌకర్యం లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. దీనిపై రామారెడ్డి గ్రామస్తులు ఆగ్రహంగా ఉన్నారు. పనులు పూర్తి చేయకపోతే ప్రజలందరూ కలిసి కలెక్టరేట్ ముట్టడికి వెళ్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి గంగమ్మ వాగు బ్రిడ్జిని పూర్తిచేయాలన్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వర్ రావు

కామారెడ్డి క్రైం : పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు అన్నారు. దేవునిపల్లి ఠాణా పరిధిలోని ఆయా గ్రామాలు, వార్డులకు సంబంధించిన గణేశ్ మండపాల నిర్వాహకులు, స్థానికులతో కలిసి పట్టణంలోని గెలాక్సీ ఫంక్షన్ హాల్‌లో, రాజంపేటలోని రైతు వేదికలో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం సూచించిన విధంగా మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. నవరాత్రుల సందర్భంగా ఆయా మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. డీజే లకు అనుమతి లేదన్నారు.రూరల్ సీఐ రామన్, భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సైలు పుష్పరాజ్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరు : భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ అన్నారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంలో మండలంలోని వినాయక విగ్రహాల నిర్వాహకులతో మాట్లాడారు. తహసీల్దార్ శివప్రసాద్, సీఐ సంపత్ పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : వినాయక చవితి, మిలాన్ ఉన్ నబీ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ సంతోష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మాట్లాడారు. ఎస్సై రంజీత్, తహశీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, వివిధ గ్రామాల గణేశ్ మంపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్) : ప్రజలు కులమతాలకు అతీతంగా వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్య వైశ్య సంఘంలో వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. జీపీ కార్యదర్శి యాదగిరి, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గంగా ప్రవీణ్, విఠల్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ సూచించారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సై మల్లారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరావు ఉన్నారు.

క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో బుధవారం జీపీ సిబ్బంది ఆయిల్ బాల్స్ వేశారు. నీరు నిల్వ ఉన్న చోట దోమల గుడ్లు పెరగకుండా ఉండడానికి చర్యలు తీసుకున్నారు. ఇళ్లల్లో కూడా చెట్ల తొట్టిలలో ఎక్కువ కాలం నీరు నిల్వ లేకుండా చూడాలని జీపీ కార్యదర్శి రాజేష్ ప్రజలకు అవగాహన కల్పించారు.

గోలి లింగాలలో వైద్యశిబిరం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని గోలి లింగాలలో బుధవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 95మంది వైద్యచికిత్సలు చేసి వారికి అవసరమైన మందులను అందజేశారు. జ్వరబాధితుల రక్తనమూనాలను జిల్లా మలేరియా విభాగానికి పంపినట్లు పీహెచ్‌సీ డాక్టర్ సృజన్‌కుమార్ తెలిపారు. యంఎల్‌హెచ్‌పీలు అజయ్, దేవిదాస్, సూపర్ వైజర్లు సునంద, యంపీహెచ్ఏ లత, శ్రీదేవి తోపాటు ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం గ్రామంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సమస్యలు తలెత్తి తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగింది. దీంతో స్పందించిన జీపీ కార్యదర్శి తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న వార్డులకు ట్యాంకర్ ద్వారా మంచినీటి సరఫరా చేశారు. నీటిసరఫరా పునరుద్ధరణ జరిగే వరకు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బీబీపేట : కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట కింద ఉన్నటువంటి ఉన్నటువంటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం తెల్లవారు జామున నేలకొరిగింది. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ పునరుద్ధరించారు. ఏఈ దివ్యగాయత్రి, జీపీ కార్యదర్శి రమేష్, కారోబార్ సిద్దరాములు సిబ్బంది ఉన్నారు.

ఐకమత్యంతో పోరాడాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : సమస్యల పరిష్కారం కోసం రైతులందరూ ఐకమత్యంతో పోరాడాలని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు అన్నారు. స్థానిక భోగేశ్వరాలయంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని రైతులు సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో మండల పరిదిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

రోడ్లు, వంతెనల పరిశీలన



రాజంపేట : మండలంలోని పలు గ్రామాల్లో వర్షాల కారణంగా నష్టపోయిన రోడ్లను, దెబ్బతిన్న బ్రిడ్జిలను, తండాలను వెళ్లే రోడ్డు మార్గాలను బుధవారం సందర్శించినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్‌రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో సమస్యలపై ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భీమరి శ్యామయ్య, మాశెట్టి శ్రీధర్, బన్సీలాల్, ఎస్టీ సెల్ అధ్యక్షులు దేవీసింగ్ డివిజన్ అధ్యక్షులు మదన్ లాల్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయగౌడ్ తదితరులున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు నష్ట నివారణ చర్యలను చేపట్టాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎంపీడీవోలకు సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 8 మండలాల ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. వర్షాల వల్ల నష్టం కలిగిన బాధితులకు తక్షణం సహాయ చర్యలు అందేలా చూడాలని అన్నారు.

రిటెయినింగ్ వాల్ నిర్మించాలి



నిజాంసాగర్(జుక్కల్): సింగితం రిజర్వాయర్ అలుగు రిటెయినింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని బుధవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో తహసీల్దార్ సవాయిసింగ్‌కు నర్వ గ్రామ ప్రజలు, రైతులు వినతిపత్రం అందజేశారు. వరద తాకిడి ఉధృతంగా రావడంతో రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోయిందన్నారు. వరదలకు కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్ విషయాన్ని కలెక్టర్ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని గ్రామస్తులు, రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు నాయకులు గోర్గంటి రాములు, శిరిగిరి గంగారం తదితరులున్నారు.

లచ్చిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి అర్బన్ : తహసీల్‌దార్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా గత ప్రభుత్వానికి విధేయుడుగా ఉంటూ ప్రస్తుతం గందరగోళ పరిస్థితిని సృష్టిస్తున్న లచ్చిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ప్రకటన విడుదల చేశారు. నాయకులు డి.శ్రీనివాస్‌రెడ్డి, బి.సాయిలు, దేవేందర్, సాయిరెడ్డి తదితరులున్నారు.

రుణమాఫీపై సర్వే



గాంధారి(ఎల్లారెడ్డి) : రేషన్ కార్డు లేని కారణంగా పంటరుణాలు మాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, వారి వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపిస్తున్నామని ఎల్లారెడ్డి ఏడీఏ ప్రసన్న లక్ష్మి, ఏవో సుప్రజ జ్యోతి అన్నారు. బుధవారం పోతంగల్ కలాన్ క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి పంటరుణాలు మాఫీ కాని రైతుల వివరాలు సేకరించి వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఏఈవోలు దీక్షిత్ రెడ్డి, షోయబ్ రైతులున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బోనాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పనిచేసిన కల్పన, బాల్‌సింగ్‌లు పదోన్నతి పొందగా, అనిత బదిలీ కావడంతో ముగురిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. గ్రామ పెద్దలు సాయాగౌడ్, పరంధాములు, బాలాగౌడ్, హెచ్ఎం శశికాంత్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పనుల్లో వేగం పెంచాలి



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావి పునరుద్ధరణ పనులను బుధవారం గ్రామీణ అభివృద్ధి శాఖ పీడీ సురేందర్ పరిశీలించారు. బావి పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వర్షాభావంతో పనులు నిలిచిపోయినట్లు అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. వర్షాలు తగ్గిన వెంటనే యుద్ధప్రాతిపదికన పనులు వేగవంతం చేయాలన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ నరేందర్, రవిగౌడ్, సాయికుమార్, నగేష్ తదితరులు ఉన్నారు.

హోమియో మందుల పంపిణీ



కామారెడ్డి అర్బన్ : డెంగీ వ్యాధి రాకుండా ముందుస్తుగా హోమియో వైద్యంలో మంచి మందులున్నాయని, ఏడాది దాటిన పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు మూడు రోజుల పాటు ఒక్కో డోసు వేసుకుంటే డెంగీ రాదని హోమియో వైద్యుడు పల్స హరీష్‌గౌడ్ అన్నారు. బీమా వారోత్సవాల్లో భాగంగా కామారెడ్డి ఎల్ఐసీ శాఖలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీఎం కృష్ణమోహన్, ఏబీఎం హిమాన్షు చౌహన్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సంపత్, అనిల్ తదితరులున్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


పనులను పరిశీలిస్తున్న డీపీవో, డీఎల్పీవో

రాజంపేట : గ్రామాలలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీవో, డీఎల్పీఓ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఎంపీవో రఘురాం, కార్యదర్శి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్లు నిలువ ఉంచొద్దు

గాంధారి(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో మురికి కాలువల్లో, వీధుల్లో నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామ మధ్యలో ఖాళీ స్థలాలు ఉన్న యజమానులు నీరు నిలువ ఉండకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్ సూచించారు. బుధవారం ఆయన తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి మండల పరిధిలోని సర్వాపూర్ గ్రామాన్ని సందర్శించారు. నిర్మాణంలో ఉన్న జీపీ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మనోహర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సైకియాట్రిస్ట్ రమణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి శ్రీకాంత్, అధ్యాపకులు సంతోష్ తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని అల్మాజీపూర్ గ్రామంలో ఆయన కాలనీలను పరిశీలించారు. గ్రామస్తులు ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ఆవరణలో మురికి నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి తదితరులున్నారు.

యువకుల శ్రమదానం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని వెంకటాపూర్‌నకు చెందిన యువకులు బుధవారం శ్రమదానం చేశారు. మూడు రోజులుగా వర్షాలు కురవడంతో గ్రామానికి వచ్చే దారి పూర్తిగా వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో గ్రామానికి చెందిన యువకులు పలుగు,పార పట్టి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించి గుంతలలో మట్టిని పోసి గుంతలను పూడ్చి వేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎల్లారం, ముస్తాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో వసతులపై జీపీ సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం గ్రామాల్లో ఓటరు నమోదు సర్వే చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాల కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన



రాజంపేట : తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు రాజంపేట గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు 6 గ్యారంటీలు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సారధి కళాకారులు రమేశ్ రావు, మహేందర్, ఐండ్ల రాము తదితరులున్నారు.

కాలువను పునరుద్ధరించాలి



బీబీపేట : మండల కేంద్రంలోని అయ్యప్ప వెంచర్ నిర్వాహకులు అక్రమంగా కొచ్చెరువులోకి వెళ్లే నీటి కాలువని పూర్తిగా తొలగించి వెంచర్ వేశారని అధికారులు స్పందించి వెంటనే కాలువను పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆయకట్టు రైతులను న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆధ్యాత్మికం

బద్దిపోచమ్మ ఆలయంలో పనులు ప్రారంభం



భిక్కనూరు : మండల కేంద్రంలోని పాత దళితవాడలోని బద్ది పోచమ్మ ఆలయంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి బుధవారం పూజ నిర్వహించారు. ఆలయం చుట్టూరా సీసీ గ్రానైట్ టైల్స్ వేయించనున్నట్లు ఆర్‌టీఏ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగం మహాలింగం, లింగం, శేఖర్, బాలరాజు, రంజీత్, ప్రకాశ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి కమ్యూనిటీ హాల్‌కు విరాళం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జిల్లా బీజేపీ నాయకుడు కాసర్ల రవీందర్ రూ.75 వేల విరాళం అందజేశారని దేవునిపల్లి వీడీసీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు భోజన్న గారి రాజు పాటిల్, ద్యావరి నవీన్ తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

కామారెడ్డి అర్బన్ : స్థానిక అయ్యప్ప ఆలయంలో బుధవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, అన్నప్రసాద సేవా సమితి నాయకులు గందె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాస్, పి లక్ష్మణ్, రఘుకుమార్, కూర శ్రీనివాస్, గంజి సతీష్, వీరమల్లి శ్రీనివాస్, పబ్బ వేణు, చీల సూర్యప్రకాష్, నక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసం ముగింపు ఉత్సవాలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : శ్రావణమాసం ముగింపు ఉత్సవాలు బుధవారం లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. 30 మంది భజన కళాకారులకు యువ యూత్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. వెంకటేశం, శ్రీహరి, సాయన్న, బాలయ్య, అల్లూరి, లక్ష్మన్‌రావు, కృష్ణయ్య, వెంకటి, యువ యూత్ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నేడు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శ్రావణమాస ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యసమాజ్ సభ్యులు నాగరాజుగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగింపు యజ్ఞ కార్యక్రమం పట్టణంలోని వైశ్యభవన్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

సంక్షిప్తం

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

ఎల్లారెడ్డి : మైనర్లకు తల్లితండ్రులు వాహనాలను నడపడానికి ఇవ్వొద్దని ఎస్సై మహేశ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన సమయంలో వారు ఏదైనా ప్రమాదానికి కారణమైతే దానికి తల్లితండ్రులు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

పాఠశాల తనిఖీ..



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చందాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను బుధవారం కాంప్లెక్స్ హెచ్ఎం కల్యాణి తనిఖీ చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో పాఠాలను బోధించాలన్నారు. ఆమె వెంట పాఠశాల హెచ్ఎం ప్రభు, ఉపాధ్యాయులు, సీఆర్పీ నర్సింలు ఉన్నారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం క్యాంప్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. పదోతరగతి పాసైన విద్యార్థినులు ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లు పొందాలన్నారు. 5, 6 తేదీల్లో మిగులు సీట్లభర్తీ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు.

ఇంగ్లిష్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో ఇంగ్లిష్ బోధించడానికి అర్హులైన వారి నుంచి ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ నారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, బీఎడ్ చేసి ఉన్న అభ్యర్థులు నేరుగా తమ దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని, వివరాలకు 9533156532లో సంప్రదించవచ్చన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

భిక్కనూరు : మండల కేంద్రంలోని పీఎంపీ వైద్యుడి నిర్లక్ష్యానికి మృతిచెందిన పెర్మల స్వామి కుటుంబానికి ఆర్‌టీఐ ప్రతినిధి గంగల్ల రవీందర్ బుధవారం రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి : పోగొట్టుకున్న ఓ సెల్‌ఫోన్‌ను బుధవారం మాచారెడ్డి ఎస్సై అనిల్ బాధితుడికి అప్పగించారు. కామారెడ్డి పట్టణానికి చెందిన రమేష్ అనే వ్యక్తి మాచారెడ్డి అంగడిలో ఫోన్ పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో 1వ అంగన్‌వాడీ సెంటర్లో పిల్లలకు బుధవారం వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు హరికృష్ణన్, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్ రాధ, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీపీ పరిశీలన

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని అంకోల్ తండా, సంగం జీపీలను బుధవారం ఎంపీవో సూర్యకాంత్ పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేసి మురుగు కాలువలను, వీధుల్లో ఉన్న చెత్త చెదారాన్ని శుభ్రం చేయించాలన్నారు. అంగన్వాడీ కేంద్రం,పాఠశాలను తనిఖీ చేశారు. కార్యదర్శి ముఖీద్ ఉన్నారు.